సాక్షి
జనగామ

మంగళవారం | 28 | మే | 2024



ఆకుపల్లెం..అదృశ్యం

ప్రకృతి అందించే విస్తరాకులను వదిలిపెట్టి.. రెడీమెడ్‌గా రంగురంగులతో తయారు చేసిన ప్లాస్టిక్ విస్తర్లను వినియోగిస్తూ అనారోగ్యానికి గురవుతున్నారు. - 8లో



31 వీక్లీ రైళ్లకు హాల్టింగ్

కాజీపేట రైల్వే జంక్షన్‌లో పలు వీక్లీ రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు హాల్టింగ్ కల్పించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42^0 / 32^0

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత, వడ గాలులు వీస్తాయి. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు



జనగామ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో జిల్లాలోని 27 పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు పోలీసు బందోబస్తు మధ్య జనగామ కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌కు సోమవారం రాత్రి చేరుకున్నాయి. ఇక్కడ వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాత పోలీసు ఎస్కార్ట్ మధ్య ఐదు ప్రత్యేక బస్సుల్లో నల్లగొండ లోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

మొక్కలను సంరక్షించాలి



కొడకండ్ల: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలతో పాటు హరితహారంలో నాటిన మొక్కలు, ప్రకృతి వనాల్లోని మొక్కలను సంరక్షించాలని డీపీఓ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని శ్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని డీపీఓ పరిశీలించి మొక్కల సంరక్షణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, పంచాయతీ కార్యదర్శి గంట శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారుల మహాయజ్ఞం



రఘునాథపల్లి/ చిల్పూరు /బచ్చన్నపేట /స్టేషన్‌ఘన్‌పూర్ /లింగాలఘణపురం: జిల్లాలోని పలు మండలాల్లో హనుమాన్ దీక్ష చేపట్టిన మాలధారులు సోమవారం భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం, హోమం, శోభాయాత్ర నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రఘునాథపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ శివాలయంలో మహాయజ్ఞం, హోమం నిర్వహించారు. గురుస్వామి పాండు వేద మంత్రోచ్చరణల మధ్య ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ మాలధారులు మల్లేష్, మహేష్, హేమేందర్, కుమార్, లక్ష్మణ్, ఉదయ్, శేఖర్, ఆంజనేయులు, రాజు పాల్గొన్నారు. చిల్పూరు మండలంలోని పల్లగుట్ట గ్రామంలో గ్రామానికి చెందిన ఎస్ఎస్ఆర్ బ్రదర్స్ శివరాత్రిరాజు-రమ, స్వామి-పుష్పలతలు సోమవారం హనుమాన్ మహాయజ్ఞం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. బచ్చన్నపేట మండలంలోని పలు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో మాలధారులు ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞాలు చేపట్టారు. అనంతరం ఇరుముడులు కట్టుకొని కొండగట్టుకు బయలుదేరారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన 11 మంది హనుమాన్ మాలధారులు మాల విరమణ కోసం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు దేవాలయానికి పాదయాత్రగా బయలుదేరారు. లింగాలఘణపురం మండల కేంద్రంలో హనుమాన్‌మాలధారులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. రాంబాబు, ఉమేశ్, సంపత్, సత్యనారాయణ, రమేష్, నర్సింహ్ములు, నరహరి పాల్గొన్నారు.



నేటి నుంచి అధ్యాపకులకు శిక్షణ

కేయూ క్యాంపస్: తెలంగాణలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంగ్లిష్ అధ్యాపకులకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఈనెల 28 నుంచి మూడు వారాల పాటు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ సోమవారం తెలిపారు. శిక్షణ కార్యక్రమం ప్రారంభ సమావేశాన్ని ఈనెల 28న ఉదయం 11గంటలకు క్యాంపస్‌లోని గణిత శాస్త్ర విభాగం సెమినార్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, గౌరవ అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి సీజే శ్రీలత, కెమిస్ట్రీ విభాగాధిపతి సవితాజ్యోత్స్న పాల్గొంటారని తెలిపారు.

దేవరుప్పుల: కామారెడ్డిగూడెంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



ఓటు హక్కు వినియోగానికి బారులుదీరిన మహిళా ఓటర్లు



పోలింగ్ 76.28 %



- ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతం
- ఉదయం 10 గంటల నుంచి పెరిగిన పోలింగ్
- గతం కంటే 7.09 శాతానికి తగ్గిన ఓటింగ్
- అత్యధికంగా కొమురవెల్లిలో 86.57, అత్యల్పంగా కొడకండ్లలో 70.3 శాతం
- పని చేయని సీసీ కెమెరాలు
- సాయంత్రం 5.45 గంటల వరకు కొనసాగిన పోలింగ్

జనగామ:

జిల్లాలో సోమవారం జరిగిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక 76.28 శాతం ఓటింగ్ జరిగింది. జిల్లాలోని 12 మండలాల పరి ధిలో 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా... జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేష్ కుమార్, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5.45కు ముగిసింది. సాయంత్రం 4 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు 10.23 శాతంతో పోలింగ్ మందకొడిగా జరుగగా, అక్కడ నుంచి పెరుగుతూ వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల వరకు ఉదయంతో పోలిస్తే... 18.15 శాతం పెరుగగా.. మధ్యాహ్నం 2 గంటల వరకు 49.66 శాతంతో ఏకంగా 21.28 శాతంతో ఓటర్లు పరుగులు పెట్టించారు. సాయంత్రం 4 గంటల వరకు 71.60శాతం ఓటింగ్ నమోదు కాగా, 21.94 శాతం మేర పెరుగగా, మొ త్తంగా 76.28 శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. చాలా చోట్ల ఓట్లు వేసేందుకు పట్టభద్రులు గంట నుంచి మూడు గంటల వరకు నిరీక్షించాల్సి వచ్చింది. ఇందులో అత్యధికంగా కొమురవెల్లిలో 86.57శాతం ఓటింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా కొడకండ్లలో 70.03శాతం మాత్రమే ఓటర్లు ముందుకు వచ్చారు. కాగా ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 15వ నంబర్ బూత్‌లో సీసీ కెమెరాలు పని చేయక పోవడంతో పలువురు ఓటర్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలింగ్ కేంద్రాలకు సెల్ ఫోన్‌లు అనుమతి లేకపోవడంతో ప్రతీ బూత్ వద్ద డిపాజిట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

తగ్గిన పోలింగ్..

జిల్లాలో 23,419 ఓట్లకు గాను 17,863 మంది ఓట్లు వేయగా, 5,556 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 14,915 ఉండగా 11,573 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 3,342 మంది ఓటింగ్‌కు రాలేదు. మహిళా పట్టభద్రుల ఓటర్లు 8,503 మంది ఉండగా, 6, 289 మంది ఓటు వేయగా, 2,214 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. 2021 మార్చి 14న జరిగిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో జిల్లాలో 83.37 శాతం ఓటింగ్ జరుగగా, ప్రస్తుతం 76.28 నమోదు కాగా, 7.09 శాతానికి తగ్గిపోయింది.



కలెక్టరేట్‌లో వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు



జనగామ:ప్రెష్ హైస్కూల్లో ఓటింగ్ సరళిని పరిశీలించిన తహసీల్దార్

వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ

కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ కంట్రోల్ రూం నుంచి జిల్లాలోని 12 మండలాల పరిధిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రక్రియను అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ పర్యవేక్షించారు.





ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే పల్లా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి, తదితరులు

ఓటరు అభ్యంతరం

పాలకుర్తి 28వ బూత్‌లో బ్యాలెట్ పేపర్లపై ప్రింటింగ్ మరకలు ఉండడంతో పలువురు ఓటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలక్షన్ అధికారులు వెంటనే స్పందించి అక్కడకు చేరుకున్నారు. దీంతో 10 నిమిషాల పాటు పోలింగ్ నిలిచి పోగా, ప్రింట్ మరకలు ఉన్న 45 బ్యాలెట్ పత్రాలను పక్కన బెట్టి, యథావిధిగా ఓటింగ్ కొనసాగించారు.

స్వల్ప ఉద్రిక్తత

పట్టణంలోని ఏబీవీ ఎయిడెడ్ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గీయుల మధ్య స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఓటర్లుకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఏబీవీ హైస్కూల్‌లో ఓటింగ్ సరళిని పర్యవేక్షించేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డితో కలిసి ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి వచ్చారు. పలువురు ఓటర్లు దాహం వేస్తోందని అడగడంతో అక్కడే ఉన్న కార్యకర్తలు 20 వాటర్ బాటిల్స్ తీసుకు రాగా, వారికి ఇచ్చేందుకు పోలీసులు అంగీకరించలేదు.

పోలింగ్ కేంద్రాల వద్ద డబ్బుల పంపిణీ...?

గత రెండు రోజులుగా ఓటర్లకు ఆయా పార్టీలు డబ్బులు పంపిణీ చేయగా, పోలింగ్ రోజు సైతం అదే పంథాను కొనసాగించారు. డబ్బుల పంపిణీ రోజు అందుబాటులో లేని వారీగా ఓటింగ్ కోసం బూత్‌ల వద్దకు రాగా.. వారిని ప్రసన్నం చేసుకునేందుకు ఆయా పార్టీల నాయకులు పోటీ పడ్డారు. రూ.500 నుంచి రూ.300 వరకు పంపిణీ చేసినట్లు ప్రచారం జరిగింది.

అవగాహన లేక...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటువేసే విధానంపై సంపూర్ణ అవగాహన లేక పోవడంతో చాలామంది బ్యాలెట్ పత్రంపై అభ్యర్థికి 5 ఓటు వేసే క్రమంలో క్రమ సంఖ్యకు బదులుగా, రైట్ గుర్తు వేసినట్లు ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించి అధికారులు సరైన అవగాహన సదస్సులు నిర్వహించక పోవడంతోనే ఇలా జరిగిందని నూతన ఓటర్లు తన ఓటు చెల్లుబాటు కాదని ఒకింత మానసిక వేదనకు గురయ్యారు

మండలాల వారీగా పోలింగ్ శాతం		
మండలం	పోలైన ఓట్లు	శాతం
నర్మెట	819	77.56
కొమురవెల్లి	587	86.57
పాలకుర్తి	1,878	75.00
రఘునాథపల్లి	1,450	79.62
జఫర్‌గఢ్	1,175	77.00
తరిగొప్పుల	444	79.00
స్టేషన్‌ఘన్‌పూర్	1,597	78.43
కొడకండ్ల	921	70.03
చిల్పూరు	908	78.00
చేర్యాల	1,834	71.78
మద్దూరు	733	78.39
దూల్మిట్ట	408	79.84
బచ్చన్నపేట	2,762	76.53
లింగాఘణపురం	1,316	78.53
దేవరుప్పుల	1,868	78.53
జనగామ అర్బన్	4,376	74.03



జనగామ:గణేశ్ వాడ హైస్కూల్లో ఓటు వేయడానికి వెళ్తున్న దివ్యాంగురాలు

ప్రశాంతంగా పోలింగ్: కలెక్టర్ రిజ్వాన్ బాషా

జిల్లాలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలను పట్టభద్రులు వచ్చారన్నారు. ఓటర్లలో చైతన్యం పెరగడంతోనే జిల్లాలో 76.28 శాతం ఓటింగ్ శాతం నమోదు అయినట్లు పేర్కొన్నారు.

జిల్లాలో రెండుగంటలకు ఒకసారి నమోదైన పోలింగ్ శాతం					
సమయం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
10గంటలు	1,670	726	-	2,396	10.23
12గంటలు	4,205	2,442	-	6,647	28.38
2 గంటలు	7,046	4,582	01	11,629	49.66
4 గంటలు	10,641	6,125	01	16,767	71.60
మొత్తం	11,573	6,289	02	17,863	76.28

కౌంటింగ్‌కు ఏర్పాట్లు : కలెక్టర్

కాళోజీ సెంటర్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, డాక్టర్ సుక్‌బీర్ సింగ్‌సంధు ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ, సన్నద్ధతపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రావీణ్య వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని, ఫలితాలు వెల్లడించేందుకు కౌంటింగ్ కేంద్రంలో మీడియాకు ప్రత్యేక పాయింట్ కేటాయించాలని చెప్పారు. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ప్రత్యేక కౌంటింగ్‌హాల్ ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్‌రూం నుంచి కౌంటింగ్ హాల్‌కు ఈవీఎంల తరలింపునకు అవసరమైన సిబ్బంది నియమించాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ ఈసీ నిబంధనల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

రుణాలు ఏకకాలంలో మాఫీ చేయాలి

జనగామ రూరల్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను అమలు చేసి రైతులకు వ్యవసాయ పంట రుణాలు ఏకకాలంలో మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసి సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2011 కౌలు చట్టం అమలు చేయాలన్నారు. సాగుదారులందరికీ ప్రభుత్వం ప్రకటించిన 12,500 సబ్సిడీ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కల్తీ విత్తనాల వ్యాపారాన్ని అరికట్టాలన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రతీ ఏటా 3 లక్షల ఎకరాలపైగా పంట నష్టం వాటిల్లుతుందని, నష్టపోయిన రైతులకు ఫసల్ బీమా వర్తింపజేసి ఆదుకోవాలన్నారు. రైతు భరోసా ద్వారా జూన్ మొదటి వారంలో రూ. 15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి చందు, మీట్యా నాయక్, మంగ బీరయ్య, రవీందర్‌రెడ్డి, భిక్షపతి, అంజయ్య, రామచొక్కం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

ధాన్యం ఉందా.. ధనమై పోయిందా?

- రైస్‌మిల్లర్లకు కొమ్ముకాస్తున్న పౌరసరఫరాల శాఖ
- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- ఉమ్మడి వరంగల్‌లో పేరుకుపోయిన బకాయిలు
- సీఎంఆర్ ధాన్యంతో కొందరు రైస్‌మిల్లర్ల వ్యాపారం
- కస్టమ్ మిల్లింగ్ రైస్‌పై అధికారుల ఉదాసీనత
- కుమ్మక్కు దందాపై 'విజిలెన్స్' ఆరా..
- క్రిమినల్ కేసులకు రంగం సిద్ధం?

సాక్షి ప్రతినిధి, వరంగల్ : సూత్రధారులు అధికారులు, పాత్రధారులు రైస్‌మిల్లర్లుగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ప్రభుత్వం వద్ద సీఎంఆర్ కింద తీసుకున్న ధాన్యం మరాడించి బియ్యం అందజేయాల్సిన కొందరు రైస్‌మిల్లర్లు.. ఆ ధాన్యాన్ని దారి మళ్లించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఎకరాల కొద్ది భూములు, నగరాలు, పట్టణాల్లో ప్లాట్లు కొనుగోలు చేసి బియ్యం చెల్లింపులో కొందరు ఏళ్ల తరబడి కాలయాపన చేస్తుంటే.. మరికొందరు మొత్తానికే ఎగవేస్తున్నారు. 2018–19 నుంచి బకాయిలకు తోడు.. ఏటా పెరిగిపోతున్న సీఎంఆర్ వసూలులో అన్నీ తెలిసిన కొందరు పౌరసరఫరాల శాఖ అధికారులు 'మామూలు'గా తీసుకోవడం ప్రభుత్వానికి గుదిబండగా మారుతోంది. వీటన్నింటిపై అధ్యయనం చేసిన పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఇటీవలే సీఎంఆర్ బాగోతంపై కొరడా ఝుళిపించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఎన్నికల కోడ్ ముగియగానే క్రిమినల్ కేసులకు సైతం వెనుకాడవద్దన్న ఆదేశాలు కలకలం రేపుతున్నాయి.



ఏటా లేటు, ఆపై లోటు..

ఉమ్మడి వరంగల్‌లో 360 వరకు బాయిల్డ్, రా రైస్‌మిల్లులు ఉండగా.. ఇరవై శాతం వరకు పని చేయడం లేదు. మిగిలిన మిల్లులకు అధికారులు ఏటా సీఎంఆర్ ధాన్యం కేటాయిస్తుండగా తిరిగి బియ్యం చెల్లించే విషయంలో జాప్యం జరుగుతోంది. నూటికి 65 శాతం వరకు రైస్‌మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ ప్రభుత్వానికి చెల్లిస్తుండగా.. గడువుకు 10–15 రోజుల ఆలస్యంతో 15 శాతం ఇస్తున్నట్లు అధికారుల రికార్డుల ద్వారా తెలుస్తోంది. అయితే ఎటొచ్చీ 10 శాతం మంది మిల్లర్లు ప్రతీసారి సతాయించి మరో సీజన్ వచ్చే వరకు బియ్యం తిరిగి ఇవ్వని పరిస్థితులు ఉండగా.. 10 శాతం మంది బకాయి, ఎగవేతదారుల జాబితాలో ఉన్నారు. ఇలాంటి వారిని గుర్తించి 6ఏ, రెవెన్యూ రికవరీ యాక్ట్‌ల ద్వారా చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే కోణంలో 2023 యాసంగిలో సీఎంఆర్ కింద ధాన్యం తీసుకున్న రైస్‌మిల్లర్లు చాలా మంది ఇప్పటికీ బియ్యం ఇవ్వలేదు. ఉమ్మడి వరంగల్‌లో 2,79,919 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ కింద ఏప్రిల్ 30 వరకు చెల్లించాల్సి ఉండగా.. కేవలం 91,998 మెట్రిక్ టన్నులు(32.86 శాతమే) వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇంకా 1,87,921 మెట్రిక్ టన్నుల బియ్యం రైస్‌మిల్లర్ల వద్దే ఉండగా.. వాటి విలువ సుమారు రూ.732.89 కోట్లు ఉంటుంది. ఇందుకు సంబంధించిన ధాన్యం రైస్‌మిల్లర్ల వద్ద ఉందా? మరాడించారా? లేక అమ్ముకున్నారా? ఆ ధాన్యం డబ్బులు ఎక్కడున్నాయి? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కాగా, గత ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్ బకాయిలు పెద్దమొత్తంలోనే ఉన్నా.. ఈ వానాకాలంలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కూడా అదే మిల్లర్లకు కేటాయించడంపై చర్చ జరుగుతోంది.

రంగంలోకి 'విజిలెన్స్'..

సీఎంఆర్ బియ్యం 2021లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివాదంగా మారిన విషయం తెలిసిందే. సీఎంఆర్ గడువు దాటినా.. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి బియ్యం ప్రభుత్వానికి చేరలేదు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం శ్రీ శ్రీ పారాబాయిల్డ్ మిల్లు, మరిపెడ మండలం ఎల్లంపేట లక్ష్మీ పారాబాయిల్డ్ మిల్లులోని ధాన్యం, బియ్యం నిల్వలు, ఎఫ్‌సీఐకి పంపాల్సిన సీఎంఆర్ వివరాలు పరిశీలించారు. జనగామ జిల్లాలో 29, వరంగల్ అర్బన్‌లో రెండు.. ఇలా ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ధాన్యం కేటాయింపు రికార్డులు, మిల్లర్లకు అలాట్ చేసిన ధాన్యం.. మిల్లర్లు ఇచ్చిన బియ్యం తేడాలను గతంలో గుర్తించారు. జనగామ 54.450 మెట్రిక్ టన్నుల బియ్యం (ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,31,560) షార్టేజ్ వచ్చినట్లు తేల్చి నివేదిక ఇచ్చారు. ఎఫ్‌సీఐకి సీఎంఆర్ రూపంలో 1,31,350 టన్నులు రావాల్సి ఉంటే.. 1.10 లక్షల వరకు మిల్లుల్లోనే ఉందని, 21,560 మెట్రిక్ టన్నులు మాత్రమే మాయమైందని తేల్చారు. ఈ సీఎంఆర్ విలువ సుమారు రూ.100 కోట్ల మేరకు ఉంటుందని అంచనా. 2022 ఏప్రిల్ 30 వరకు బియ్యం చెల్లించాలని రైస్‌మిల్లర్లకు ఆదేశాలు ఇచ్చినా.. చాలా మంది ఖాతరు చేయలేదు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ బాగోతంపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కమిషనర్ 'విజిలెన్స్'ను రంగంలోకి దించి ఆరా తీస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఆకుపల్లెం.. అదృశ్యం

కనుమరుగవుతున్న మోదుగాకు విస్తర్లు

- ప్రతి కార్యంలోనూ ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం
- పర్యావరణానికి పొంచి ఉన్న ప్రమాదం
- పాతరోజులే బాగున్నాయంటున్న ప్రజలు



మోదుగు ఆకులతో విస్తర్లు కుడుతున్న గౌరమ్మ

నేటి కంప్యూటర్ యుగంలో మానవుడు ప్రకృతి 'ప్రసాదా'లకు క్రమక్రమంగా దూరమవుతున్నాడు. సహజవనరులను అందిపుచ్చుకునేందుకు అవకాశం లేక పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ప్లాస్టిక్ భూతాన్ని ఆశ్రయిస్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నాడు. అభివృద్ధి పేరుతో బందీగా మారిన మానవుడు.. తనకున్న కళలు, అభిరుచులను కాలగర్భంలో కలుపుతూ ఉత్తచేతులతో కాలం వెల్లదీస్తున్నాడు. ఇందులో భాగంగా ప్రకృతి అందించే విస్తరాకుల(ఆకుపల్లెం)ను వదిలిపెట్టి డిస్పోజబుల్స్ కోసం పరుగులు తీస్తున్నాడు. ఫలితంగా ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుండగా.. ప్రజలకు ఉపాధి దూరం చేస్తోంది.

రాయపర్తి: ఆయుర్వేద గ్రంథం ప్రకారం ఆకులో భోజనం చేయడం వల్ల కంటిచూపు సరిగా ఉండడంతోపాటు జీర్ణశక్తి పెరుగుతుంది. సహజసిద్ధంగా లభించే మోదుగ ఆకుపై ఎలాంటి రసాయన మైనపు పూతలు ఉండవు. ఇందులో భోజనం చేయడం వల్ల ఎలాంటి రసాయనిక పదార్థం దరిచేరక మానవుడు ఆరోగ్యంగా ఉంటాడు. ఎక్కువ కాలం నిల్వ ఉండే విస్తరాకు మోదుగ. అప్పట్లో మోదుగ, మర్రి, రావి, అరటి, పసుపు ఆకులను విస్తర్లుగా కుట్టి అందులో భోజనం చేసేవారు. వేసవిలో మోదుగ ఆకులు సేకరించి ఎండబెట్టి పనులు లేని సమయాల్లో ఇంటివద్ద అందరూ ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటూ విస్తర్లు కుట్టేవారు. ఇలాంటి తరుణంలో మానవులు యాంత్రిక జీవనం కొనసాగిస్తూ రెడీమేడ్‌గా రంగురంగులతో తయారు చేసిన ప్లాస్టిక్ విస్తర్లను ప్రతి కార్యాలయంలో వినియోగిస్తూ అనారోగ్యానికి గురవడమేకాకుండా పర్యావరణానికి హాని తలపెడుతున్నారు. పల్లెల్లో ప్రతి కిరాణా షాపుల్లో ప్లాస్టిక్ ప్లేట్లు లభిస్తుండడంతో విస్తరాకులను మర్చిపోతున్నారు. మోదుగ ఆకు విస్తర్లను కేవలం దైవపూజల్లో మాత్రమే ఉపయోగించడం గమనార్హం.

ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనంతో అనర్థాలు..

ప్లాస్టిక్ ప్లేట్లలో వేడి భోజనం చేయడం వల్ల అందులో ఉన్న రసాయనాలు కరిగి వారానికి 5గ్రాముల పాలిథీన్ పదార్థం మనిషి శరీరంలోకి చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. భోజనం చేస్తున్నప్పటి నుంచి ప్రతి పనికి ప్లాస్టిక్‌ను వినియోగించడం మూలంగా పాలిథీన్ శరీరంలోకి చేరి వివిధ రకాల వ్యాధుల బారిన పడడంతోపాటు క్యాన్సర్‌కు దారితీస్తుందని చెబుతున్నారు.



విస్తరాకు కట్టలతో బరిగెల ఎల్లయ్య



కుట్టేందుకు సిద్ధంగా ఉన్న మోదుగాకులు

ఎండాకాలంలో ఆకులు సేకరిస్తా..

ఎండాకాలంలో మోదుగ ఆకులు సేకరించి పనిలేని సమయంలో విస్తరాకులు కుడుతా. ఒక్కోవిస్తరాకు కట్టకు రూ.70 చెల్లించి తీసుకెళ్తారు. ఆ డబ్బు కుటుంబ ఖర్చులకు ఉపయోగపడుతోంది. మోదుగ ఆకు విస్తరిలో అన్నం తింటే రుచి వేరుగా ఉంటది. అయితే ప్లాస్టిక్ ప్లేట్లు రావడంతో మోదుగ ఆకులకు డిమాండ్ తగ్గింది. ఉపాధి కోల్పోయాం. ఇప్పుడు దేవాలయాల్లో మాత్రమే వినియోగిస్తున్నారు.

– బాషబోయిన గౌరమ్మ, తిర్మలాయపల్లి

ఆకు విస్తర్లను పట్టణాల్లో విక్రయిస్తా..

మాది వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామం. తిర్మలాయపల్లి, ఆరెగూడెం, వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో విస్తరు కట్టలు సేకరిస్తా. ఒక్కో కట్టకు రూ.70 చొప్పున చెల్లిస్తా. ఒక్క కట్టలో 100 ఆకులు (పేట్లు) వరకు ఉంటాయి. ఇక్కడి నుంచి తీసుకెళ్లి వరంగల్‌లోని కాశిబుగ్గ, కొత్తవాడ, శివనగర్, రంగశాయిపేట, హనుమకొండ ప్రాంతాల్లో విక్రయిస్తా. వీటిని ఎక్కువగా దేవాలయాల్లో పూజా కార్యక్రమాల్లో వినియోగిస్తారు. పెళ్లిళ్లు, పలు కార్యక్రమాల్లో అందరూ ప్లాస్టిక్ విస్తరాకులే వాడుతుండడంతో గిరాకీ అంతంత మాత్రంగా ఉంటోంది.

– బరిగెల ఎల్లయ్య, తిర్మలాయపల్లి

ఇంటికి వస్తూ.. ఆటోలోనే ప్రాణం విడిచిన మహిళ

- తిరుమలగిరి–కొడకండ్ల మధ్య ఘటన
- తల్లి మృతితో అనాథ అయిన కూతురు



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కూతురు మానస

శశిరేఖ(ఫైల్)

కురవి: చెల్లి దగ్గరికి వెళ్లిన ఓ మహిళ.. తిరిగి తన ఇంటికి వస్తున్న క్రమంలో ఆటోలోనే ప్రాణం విడిచింది. ఈ విషాదకర ఘటన తిరుమలగిరి–కొడకండ్ల మధ్య జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవికి చెందిన ధర్మవరపు శశిరేఖ(62), రామస్వామి దంపతులు. రామస్వామి 25 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా కురవిలోనే రోడ్డు పక్కన గుడిసె వేసుకుని జీవిస్తోంది. కొన్నేళ్ల క్రితం చిన్నారి మానసను దత్తత తీసుకుని సాదుకుంటోంది. మానస ప్రస్తుతం కురవి హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం తన బిడ్డతో కలసి శశిరేఖ హైదరాబాద్‌లో ఉంటున్న చెల్లి వద్దకు వెళ్లింది. ఆదివారం రాత్రి జ్వరం రావడంతో ఆటోలో హైదరాబాద్ నుంచి కురవికి బయలుదేరింది. తిరుమలగిరి–కొడకండ్ల గ్రామాల సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఆటోలోనే శశిరేఖ ప్రాణాలు విడిచింది. దీంతో మృతదేహాన్ని అదే ఆటోలో కురవికి తీసుకొచ్చారు. శశిరేఖ మృతి చెందిన విషయం బంధువులకు తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. కాగా, శశిరేఖ మృతి చెందడంతో మానస అనాథగా మారింది. తల్లి శశిరేఖ మృతదేహం మీదపడి మానస గుండెలవిసేలా రోదించింది. ఇక తనకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటనను చూసిన ప్రతి ఒక్కరూ చలించిపోయారు. ప్రభుత్వం, అధికారులు.. చిన్నారిని ఆదుకోవాలని కోరారు. జీపీ కార్మికులు, బంధువుల సమక్షంలో శశిరేఖ అంత్యక్రియలు జరిగాయి.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

రామన్నపేట : ములుగు జిల్లా రాజుపేటలోని కెనరా బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ తమ వద్ద 46 తులాల బంగారం తీసుకెళ్లి డబ్బులు చెల్లించకుండా పరారైనట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు. ప్రశాంత్.. ఖాతాదారుల బంగారం విలువ లెక్కించిన అనంతరం అధికారులు రుణం చెల్లించేవారు. ఈ క్రమంలో బ్యాంకు ఆడిటింగ్‌లో తాకట్టుపెట్టి న బంగారానికి, నిల్వ ఉన్న బంగారం విలువకు తేడా రావడంతో ప్రశాంత్ పరారయ్యాడు. సదరు వ్యక్తి వరంగల్ వ్యాపారులు ఇంద్రనీల్ వద్ద 24 తులాలు, సీహెచ్ సురేశ్ వద్ద 11 తులాలు, కె.పున్నంచందర్ వద్ద 11 తులాల బంగారం తీసుకెళ్లి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపులో అక్రమాలు

- పలువురు రైతుల ఆరోపణ

హన్మకొండ: కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, బిగింపులో టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులకు అనుకూలంగా వ్యవహరించే వారికి అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి, ఆశించిన మేరకు సహకరించని వారికి తక్కువ సామర్థ్యం కలిగిన విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తూ అన్యాయం చేస్తున్నారని అన్నదాతలు మొత్తుకుంటున్నారు. దుగ్గొండి మండలం దేశాయిపల్లి గ్రామంలో ఎస్ఎస్–29 ట్రాన్స్‌ఫార్మర్ 25 కేవీఏ ఉండగా కాలిపోయింది. దీనిని మార్చే క్రమంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని స్థానిక రైతులు తెలిపారు. 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులు 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారని వారు తెలిపారు. ఇక్కడ బిగించాల్సిన 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంకటాపురానికి మార్చారని పేర్కొన్నారు. తక్కువ సామర్థ్యం కలిగిన 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చడం ద్వారా తాము లోడ్ సరిపోక, లోవోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళాకళాశాల పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి



హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



ఓటింగ్ సరళి పరిశీలన

వరంగల్– ఖమ్మం– నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పలుచోట్ల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీంచారు. ఈ ఎన్నికల్లో తానే గెలుస్తానని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళాకళాశాల పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

పోలింగ్ కేంద్రంలో స్వల్ప ఉద్రిక్తత..

వరంగల్ చౌరస్తా : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా సోమవారం వరంగల్ 26వ డివిజన్‌లోని వివేకానంద జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రం ఎదుట స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఓ పార్టీ నాయకులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ ప్రలోభ పెడుతున్నట్లు రెండు పార్టీల శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించారు. పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈకేంద్రంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కాజీపేట: పోలీసులతో వాగ్వాదం చేస్తున్న కార్యకర్తలు

పదిమందికి పైగా అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి తీన్మార్ మల్లన్న

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు పది మందికిపైగా అనుచరులు వెళ్లడంతో ఇతర పార్టీల కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మల్లన్న వెంట అంత మందిని ఎలా లోపలికి అనుమతిస్తారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిబంధనల మేరకే ఓటర్లు వెళ్లారని విధి నిర్వహణలో ఉన్న పోలీసులు స్పష్టం చేయడంతో పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిద్దామంటూ నిరసన తెలిపారు. తీన్మార్ మల్లన్నకు ఉన్న అదనపు అర్హత ఏంటని కాంగ్రెసేతర నాయకులు నిలదీయడంతో సరైన సమాధానం చెప్పలేక పోలీసులు ఇబ్బంది పడడం చర్చనీయంశంగా మారింది.

బ్యాలెట్ పత్రాల్లో ముద్రణ లోపం

- అధికారుల జోక్యంతో సమస్య పరిష్కారం

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 28వ పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రాల్లో ముద్రణ లోపంతో మరకలు పడ్డాయని కొంతమంది ఓటర్లు సిబ్బందిని నిలదీశారు. దీంతో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సై సాయి ప్రసన్న కుమార్.. ఈ విషయం ఉన్నతాధికారులకు చెప్పారు. వారు మరకలతో కూడిన 44 పత్రాలను పరిశీలించి వాటిని పక్కన పెట్టించారు. ఆ తరువాత వరుస సంఖ్యలో బ్యాలెట్ పత్రాలు అందించారు. ఏజెంట్ల సమక్షంలో ఓటర్లు తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారు.

ఓటింగ్‌కు పలువురు దూరం

కాజీపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన పోల్ చిటీలు అందక కాజీపేటలో పలువురు ఓటింగ్‌కు దూరమయ్యారు. తాము ఏ పోలింగ్ కేంద్రం వెళ్లి ఓటు వేయాలో తెలియక తికమక పడ్డారు. దరఖాస్తు చేసింది కాజీపేట మండలంలో కావడంతో అన్ని పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఒక ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఓటువేసే పరిస్థితి కనిపించింది. పట్టణంలో సగం మందికి కూడా పోల్ చిటీల పంపిణీ జరగకపోవడంతో ఎక్కడా ఓటు వేయాలో తెలియక పలువురు మిన్నకుండిపోయారు.

ముగ్గురిపై కేసు

హసన్‌పర్తి: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కేయూ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్‌డీఎల్సీఈ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సమీపంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఫొటోలతో ముద్రించిన పోల్ చీటీలతో ప్రచారం చేస్తున్నారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. ఈమేరకు ప్రచారం నిర్వహిస్తున్న అశోక్, జ్యోతి, మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ చెప్పారు.

బ్యాలెట్ ద్వారా ఓటు వేయడం అనుభూతినిచ్చింది

- కేయూ విద్యార్థి నాయకుడు పిన్నింటి విజయ్‌కుమార్



సిరాచుక్క చూపుతున్న విజయ్‌కుమార్ దంపతులు

హన్మకొండ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మొదటిసారి ఓటు వేయడం అనుభూతినిచ్చిందని, బ్యాలెట్, ప్రాధాన్యత ఓటు ప్రక్రియలో ఓటు వేయడం ఇదే మొదటి సారని కేయూ విద్యార్థి నాయకుడు పిన్నింటి విజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జూనియర్ కళాశాలలో విజయ్‌కుమార్, సింధు దంపతులు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇప్పటి వరకు ఈవీఎం ద్వారా ఓటు వేసిన తాము.. మొదటి సారి బ్యాలెట్ ద్వారా వేయడం అనుభూతినిచ్చిందన్నారు.

ఎండకు కిందపడిన అదనపు పీఓ



బెంచీపై పడుకున్న అస్మత్ పాషా

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో(బాలుర) 178,179 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా, ఆయా కేంద్రాల్లో అదనపు పీఓగా(పోలింగ్ ఆఫీసర్) అస్మత్ పాషా విధులు నిర్వర్తించారు. ఎండ తీవ్రతకు కళ్లు తిరిగి కింద పడిపోగా వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

లైన్‌మెన్ పోలోజు బాబు బదిలీ

సాక్షి స్పందన

హన్మకొండ: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీజీ ఎన్పీడీసీఎల్ దుగ్గొండి సెక్షన్‌కు చెందిన లైన్‌మెన్ పోలోజు బాబును నర్సంపేట డీఈ శ్రీధర్ బదిలీ చేశారు. ఈ నెల 23న 'పైస ముడితేనే పని' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ప్రాథమిక విచారణ జరిపించిన డివిజనల్ ఇంజనీర్ శ్రీధర్.. దుగ్గొండి సెక్షన్‌లో లక్ష్మీపురం ప్రాంత లైన్‌మెన్‌గా పని చేస్తున్న పోలోజు బాబును నెక్కొండ విద్యుత్ సబ్ స్టేషన్‌కు బదిలీ చేశారు. తదుపరి చర్యలకు గాను పూర్తి స్థాయిలో డిపార్ట్‌మెంట్ విచారణకు ఆదేశించారు.

దొంగలను త్వరగా పట్టుకోవాలి



పరిశీలిస్తున్న డీసీపీ రవీందర్

పరకాల : పరకాలలోని ఓ వ్యాపారి ఇంట్లో పట్టపగలే జరిగిన దొంగతనం ఘటనను వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పుల్లా రవీందర్ సోమవారం పరిశీలించారు. ఆదివారం వ్యాపారి అనంతుల ప్రకాశం ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. బంగారు ఆభరణాలు చోరీ అయిన విషయం తెలియగానే డీసీపీ పరకాలకు చేరుకొని దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. పట్టణంలోని సీసీపుటేజీలు, ఇతర ఆధారాలతో దొంగలను త్వరగా పట్టుకోవాలని డీసీపీ రవీందర్ ఆదేశించారు.

కాజీపేట జంక్షన్‌లో 31 వీక్లీ రైళ్లకు హాల్టింగ్

- రెగ్యులర్ ట్రైన్‌గా భద్రాచలంరోడ్–బెలగావి ఎక్స్‌ప్రెస్



కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే జంక్షన్‌లో దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు వీక్లీ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో పలు సెక్షన్లలో చేపట్టిన ఇంజనీరింగ్ బ్లాక్‌ల కారణంగా ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్–బల్లార్షా, వరంగల్ మార్గంలో వెళ్లే పలు వీక్లీ రైళ్లకు హాల్టింగ్ కల్పించినట్లు సోమవారం రైల్వే అధికారులు తెలిపారు. అలాగే, భద్రాచలంరోడ్–బెలగావి (07336) ఎక్స్‌ప్రెస్ రోజూ 19:18 గంటలకు రెగ్యులర్ ట్రైన్‌గా అందుబాటులోకి రానుంది.

హాల్టింగ్ కల్పించిన రైళ్లు ఇవే

హైదరాబాద్–రక్సోల్ (07051) ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం 22:48 గంటలకు, సికింద్రాబాద్–దానాపూర్ (07419) ప్రతి శనివారం 17:00 గంటలకు, హైదరాబాద్–పాట్నా (07255) ప్రతి గురువారం 01:25 గంటలకు, సికింద్రాబాద్–పాట్నా (07256)ప్రతి శుక్రవారం 23:00 గంటలకు, సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ (04122) ప్రతి శనివారం 06:38 గంటలకు, సికింద్రాబాద్–దానాపూర్ (03226) ప్రతి ఆదివారం 12:02 గంటలకు, హైదరాబాద్–గోరఖ్‌పూర్ (02575) ప్రతి శుక్రవారం 23:17 గంటలకు, సికింద్రాబాద్–రక్సోల్ (07007) ప్రతి బుధవారం 17:10 గంటలకు, సికింద్రాబాద్–రక్సోల్ (07051) ప్రతి శనివారం 22:48 గంటలకు, సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ (05294) ప్రతి గురువారం 12:00 గంటలకు, సికింద్రాబాద్–రక్సోల్ (07005) ప్రతి సోమవారం 23:47 గంటలకు, మహబూబ్‌నగర్–గోరఖ్‌పూర్ (05304) ప్రతి సోమవారం 22:58 గంటలకు సికింద్రాబాద్–దానాపూర్ (07021)ప్రతి గురువారం 10:43 గంటలకు, సికింద్రాబాద్–నిజాముద్దీన్ (07031)ప్రతి ఆదివారం 22:38 గంటలకు, సికింద్రాబాద్–దానాపూర్ (07647) ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం 22:48 గంటలకు చేరుకుంటుంది.

వరంగల్ వైపునకు వెళ్లే రైళ్లు

సికింద్రాబాద్–తిరుపతి (07482) ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం, హైదరాబాద్–నర్సాపూర్ (07631) ప్రతి ఆదివారం, సికింద్రాబాద్–షాలిమార్ (07225) ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం కాజీపేటకు చేరుకుంటాయి.

సికింద్రాబాద్ వైపునకు..

భద్రాచలంరోడ్–బెలగావి (07336) ఎక్స్‌ప్రెస్ రోజూ, రక్సోల్–సికింద్రాబాద్ (07052) ఎక్స్‌ప్రెస్ ప్రతి గురువారం, దానాపూర్–సికింద్రాబాద్ (07420), దానాపూర్–సికింద్రాబాద్ (07648) ప్రతి మంగళవారం తిరుపతి–సికింద్రాబాద్ (07481), గోరఖ్‌పూర్–హైదారబాద్ (02576) ప్రతి సోమవారం, దానాపూర్–సికింద్రాబాద్ (03225) ప్రతి శనివారం, సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ (04121), రక్సోల్–సికింద్రాబాద్ (07006) ప్రతి శుక్రవారం, రక్సోల్–సికింద్రాబాద్ (07008), గోరక్‌పూర్–మహబూబ్‌నగర్ (05303) ప్రతి ఆదివారం, షాలిమార్–సికింద్రాబాద్ (07226), హజ్రత్‌నిజాముద్దీన్–సికింద్రాబాద్ (07032) ప్రతి బుధవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటాయి.

కాల్చొద్దు.. కలియదున్నండి

- పంట వ్యర్థాలతోనే భూసారం
- అవశేషాల పొగతో అనర్థాలు

మహబూబాబాద్ రూరల్ : వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు కోతలు పూర్తయ్యాక వాటి అవశేషాలు(వ్యర్థాలు) కాల్చకుండా నేలలో కలియదున్నాలని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ అన్నదాతలకు సూచిస్తున్నారు. దేశంలో ఏటా 500 నుంచి 600 మిలియన్ టన్నుల పంట వ్యర్థాలు (వరి, పత్తి, మొక్కజొన్న అవశేషాలు) మిగులుతోంది. ఇందులో 20 నుంచి 30% రైతులు వాటికి నిప్పు పెట్టి బూడిద చేస్తున్నారు. అలా చేయడం వల్ల పర్యావరణ సమస్యలు ఉత్పన్నం అవుతాయని తెలిపారు. ప్రధానంగా పంజాబ్, హర్యాణ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అధికంగా కాల్చడం వల్ల ఢిల్లీ వంటి పక్క రాష్ట్రాల్లో విపరీతమైన గాలి కాలుష్యం అవడం జరుగుతోందని గుర్తు చేశారు. ఇక్కడ ప్రధాన సమస్య వరి, గోధుమ, మొక్కజొన్న, పప్పుదినుసు పంటలను కాల్చి వే యడమని, తెలంగాణలో సగటున 30 నుంచి 40% వరి, 90 నుంచి 95% పత్తి అవశేషాలకు నిప్పు పెట్టి కాల్చి బూడిద చేయడం జరుగుతుందన్నారు.

అవశేషాలను కాల్చడానికి ప్రధాన కారణాలు..

- మొదటి, రెండో పంట మధ్య తక్కువ వ్యవధి.
- అవశేషాలు కుళ్లడానికి అధిక సమయం.

కాల్చడం వల్ల కలిగే సమస్యలు..

- పర్యావరణ కాలుష్య కారకాలైన సీఓ, సీఓ–2, ఎన్–2ఓ, ఎస్ఓ–2 విడుదలవ్వడం.
- గాలి నాణ్యత తగ్గడం, భూసారం క్షీణించడం, నత్రజని కర్బన స్థాయి తగ్గడం ఉపయోగకర సూక్ష్మజీవులు కీటకాలు చనిపోవడం.
- 5.5 కిలోల నత్రజనితోపాటు 2.3 కిలోల భాస్వరం 25 కిలోల పొటాషియం 1.2 కిలోల సల్ఫర్ నష్టం వాటిల్లుతుంది.


పంట అవశేషాల ఉపయోగాలు..

- పశువులకు మేతగా ఉపయోగించడం, వంట చెరుకుగా వాడుకోవడం.
- సేంద్రియ వ్యవసాయంలో కంపోస్టింగ్, పుట్టగొడుగుల సాగు కోసం ఉపయోగించవచ్చు.
- అవశేషాల నుంచి బయోఇథనాల్ ప్యాకింగ్ మెటీరియల్ కోసం ఉపయోగపడటం.
- నేలలో కలియదున్నడం ద్వారా కర్బన స్థాయి పెరగడం, గాలిప్రసారం, భూభౌతిక లక్షణాలు పెరుగుతాయి.
- నేల మీద మల్చ్‌గా ఉపయోగించవచ్చు.

నేలలో కలియదున్నితే..

- నత్రజని 1.2 నుంచి 2 కిలోల వరకు, భాస్వరం 1 నుంచి 1.6 కిలోల వరకు, 12 నుంచి 13.6 కిలోల వరకు నేలకు అందజేయవచ్చు.

బయోచార్ తయారు చేసుకోవడం.



ఆమనగల్‌కు వెళ్లే దారిలో కాల్చిన పంట అవశేషాలు

- పంట అవశేషాలను ట్రాక్టర్ బెల్లర్ సహాయంతో వరిగడ్డిని చుట్టలుగా చుట్టుకోవచ్చు.
- గడ్డి త్వరగా కుళ్లడానికి వ్యర్థ డికంపోజర్ లేదా పూసా డికంపోజర్, పీజేటీఎస్ఏయూ కన్సార్టియం ద్వారా త్వరగా కుళ్లబెట్టవచ్చు.